
ఫీజుల పేరిట వేధిస్తే కఠినచర్యలు: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరిట విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 'కొన్ని కళాశాలల్లో విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు, ప్రాక్టికల్స్‌కు హాజరుకాకుండా అడ్డుకోవడం వంటి సంఘటనలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అటువంటి కళాశాలలను బ్లాక్‌లిస్టులో పెట్టి.. కఠినచర్యలు తీసుకుంటాం. కళాశాలల ఖాతాలో ఫీజును ప్రభుత్వం జమ చేస్తుంద'ని కలెక్టర్ తెలిపారు.

ఏళ్లుగా.. ఎదురుచూపు



● కలగా సంకుజోడి రిజర్వాయర్ నిర్మాణం ● శివారు భూములకు అందని సాగునీరు
● ఎగువ భూముల సర్వేతో ఆయకట్టు రైతుల ఆందోళన



● సుమారు 119 ఎకరాల విస్తీర్ణం కలిగిన సంకుజోడి చెరువు ఇది. ముళ్లపొదలతో నిండి, ఇసుక, పూడిక మేట వేసి అధ్వాన్న స్థితిలో ఉంది. ఏళ్లుగా కనీస స్థాయిలో పూడిక తీయక పోవటంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో ఆక్రమణ చెరలో చిక్కి చెరువు రూపం మారిపోతోంది.

● నీటితో నిండిన సమయంలో వరద నీరు ప్రవహించే ఆనకట్ట ఇది. వందేళ్ల కిందట నిర్మించటంతో శిథిలావస్థకు చేరుకుంది. పదేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వం మరమ్మతులు చేపట్టగా గత ఐదేళ్లుగా రైతులు వినతులందించినా.. వైసీపీ సర్కారు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఎప్పుడు కొట్టుకుపోతుందోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీటి వనరు: సంకుజోడి
విస్తీర్ణం: 119 ఎకరాలు
ఆయకట్టు: 772 ఎకరాలు
ప్రధాన కాలువలు: 8

హరిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లుగా అతివృష్టి, అనావృష్టి ఫలితంగా చెరువులు నిండినా.. ఎండినా.. వినియోగించుకోలేని దుస్థి తి రైతులది. వేలకు వేలు భూమి శిస్తులు చెల్లిస్తున్నా పంట చేతి కందని పరిస్థితి మందస మండలం సంకుజోడి ఆయకట్టు రైతాంగానిది. ఏటా నాయకులు రావడం.. రిజర్వాయర్‌గా సంకుజోడిని మారుస్తామంటూ హామీలివ్వడం పరిపాటిగా మారింది. దీంతో ఇక్కడి ఆయకట్టు రైతుకు రిజర్వాయర్ నిర్మాణం కలగా మారింది.

ఆయకట్టు గ్రామాలు..

మఖరజోల, కుంటికోట, అల్లిమెరక, రంగోయి, కమలాపురం, బాలిగాం, వీవీఆర్‌పురం, డబారు, జీఆర్‌పురం, కొత్తకమలాపురం, కొత్తపల్లి, మదనాపురం, గోవిందపురం గ్రామాల పరిధి సుమారు 772 ఎకరాలు ఆయకట్టు ఉంది. కాగా కేవలం కాగితాలకే ఈ ఆయకట్టు పరిమితమైందని చెరువులో నీరు నిలువక శివారు భూములకు నీరందని దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని రిజర్వాయర్‌గా మలిస్తే మరో 15గ్రామాల పరిధి సుమారు 2500 ఎకరాలకు రెండు పంటలకు నీరందుతుంది.

సర్వేతో ఆందోళన..

సంకుజోడి చెరువు ఫీడర్ ఛానళ్లుగా ఉన్న రెండు కాలువలు పలాస మండల పరిధిలో ఉన్నాయి. ఆ ప్రాంత భూములన్నీ ప్రస్తుతం పారిశ్రామిక హబ్ కోసం సర్వే నిర్వహిస్తుండడంతో ఆయకట్టు రైతాంగం ఆందోళన చెందుతోంది. ఆప్రాంతం అంతా పరిశ్రమలు ఏర్పాటైతే నీటి లభ్యత ప్రశ్నార్థకంగా మారుతుంది. దీంతోపాటు జల కాలుష్యంపై కూడా పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇటు ఏళ్లుగా రిజర్వాయర్ నిర్మాణం కల మారటంతోపాటు ప్రస్తుతం ప్రభుత్వం సర్వే చేస్తుండడంతో రైతుల ఆశలు అడుగంటుతున్నాయి.

నిధులు వృథా..

చెరువు మరమ్మతుల కోసం ఏటా రూ.లక్షల్లో నిధులు మంజూరు చేస్తున్నా.. వృథాగా మారుతున్నాయి. మంజూరు చేసిన నిధులు రైతులకు వినియోగించాలి. గండ్లు పూడ్చి కాలువలను శుభ్రపరచాలి. శాశ్వత పనులు చేపట్టి అవసరమైన కాంక్రీటు, సిమెంటు పనులు చేసి రైతుకు దోహదపడాలి. ప్రస్తుతం నీరున్నా మదుముల వద్ద షట్టర్లు మూసుకోక నీరు వృథాగా పోతోంది. కాలువలకు గండ్లు పడడంతో ప్రధాన గెడ్డ వెంబడి నీరు మొత్తం సముద్రంలో కలిసిపోతోంది. వంద ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న సంకుజోడి నీటి వనరును రిజర్వాయర్‌గా మలిస్తే 2500 ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా పలు గ్రామాలకు తాగునీటి వసతి కలుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ చూపితే తమ కల నెరవేతుందని ప్రజల ఆకాంక్ష.

ఆక్రమణల పర్వం..

సంకుజోడి చెరువు విస్తీర్ణం రోజురోజుకు కుచించుకుపోతోంది. చెరువు గర్భంలోనే అధికారులు గతంలో రైతులుకు పట్టాలు ఇవ్వటంతో కొంతమంది సాగు చేస్తున్నారు. మరికొందరు ఆక్రమణలు చేపట్టి పంటలు వేస్తున్నారు. చెరువులో సగం రోజులుకూడా నీరు నిల్వ ఉండకపోవటంతో రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణలు అధికమవుతున్నాయి. ఇప్పటికే ఇరవై ఎకరాల వరకు ఆక్రమణలకు గురైందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

ఆదుకోని వైసీపీ ప్రభుత్వం..

గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం సాగునీటి వనరులపై పూర్తి నిర్లక్ష్యం వహించింది. దీనికి నిరసనగా సంకుజోడి ఆయకట్టు పరిధిలోని ఎంపీటీసీ మాధవరావు ప్రభుత్వ తీరుకు నిరసనగా తన పదవికి రాజీనామా చేశారు. రైతులపై వైసీపీ ప్రభుత్వం తీరుకు (మిగతా 8వ పేజీలో..)

'నీటి సంఘాల'కు రీ షెడ్యూల్

● డిసెంబరు 5న నోటిఫికేషన్ ● 8న డబ్ల్యూయూఏలకు ఎన్నికలు
● 11న డీసీలకు, 14న ప్రాజెక్టు చైర్మన్ ఎంపిక
● ఎమ్మెల్యేల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

నరసన్నపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నెల 5న విడుదల కానుంది. 8న డబ్ల్యూయూఏలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14న ప్రాజెక్టు చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. వాస్తవానికి ఈ నెల 20న నోటిఫికేషన్ ఇచ్చేలా గతంలో షెడ్యూల్ ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలో వంశధార ప్రాజెక్టు పరిధిలోని 54 డబ్ల్యూయూఏలు, 9 డీసీల ఓటర్ల జాబితాలు, ప్రాదేశిక నియోజకవర్గాల(టీసీ) గుర్తింపు, ఎన్నికల అధికారుల నియామకం, వారికి శిక్షణ వంటివి రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు పూర్తిచేశారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేలు కీలకం. కాగా అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఈ ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు కొద్దిరోజుల కిందట ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు ముగియడంతో ఈ ఎన్నికలపై దృష్టి సారించింది. రీ షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు వచ్చే నెల 5న ఆయా డబ్ల్యూయూఏ స్థాయిలో నియమించిన ఎన్నికల అధికారులు ఎక్కడికక్కడ స్థానికంగా నోటిఫికేషన్ ఇస్తారు. 8న ఎన్నిక నిర్వహిస్తారు. ప్రాదేశిక (టీసీ) సంఘాల ఎన్నికలను మధ్యాహ్నం వరకు నిర్వహించి.. అనంతరం వారితో సమావేశం నిర్వహిస్తారు. డబ్ల్యూయూఏ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికలు కూడా అదే రోజు సాయంత్రానికి పూర్తి చేస్తారు. ఇక 11న డీసీలు, 14న ప్రాజెక్టు కమిటీ ఎన్నిక నిర్వహిస్తారు. వంశధార ప్రాజెక్టు పరిధిలో 54 నీటి సంఘాలు ఉండగా, 9 డీసీలు, ప్రాజెక్టు చైర్మన్‌ను ఓటర్లు చేతులెత్తి ఎన్నుకోనున్నారు. ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వ్యక్తులకే ప్రాధాన్యం దక్కనుంది. దీంతో ఆశావహులు ఈ పదవుల కోసం మంత్రి, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వంశధార ప్రాజెక్టు చైర్మన్ పదవి కోసం టెక్కలి, నరసన్నపేట నియోజవర్గాలకు చెందిన ఆశావహులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో పలుమార్లు నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన వ్యక్తులకు ఈ పదవి వరించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన వ్యక్తి ఈ పదవి చేపట్టారు. ఈసారి టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నవారికే ఈ పదవులు ఇవ్వాలని పార్టీ హైకమాండ్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో చూడాలి.



నరసన్నపేటలో వంశధార కాలువ



పన్నులు.. పేరుకుపోతున్నాయ్!

● ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.200 కోట్లు ● వసూళ్లలో నగరపాలక సంస్థ అధికారుల ఉదాసీనత

శ్రీకాకుళం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):

అవి ప్రభుత్వ కార్యాలయ భవనాలు. ఏళ్ల తరబడి కాదు.. దశాబ్దాలుగా పన్ను బకాయిలు రూ.లక్షలు, రూ.కోట్లలో పేరుకుపోయాయి. సామాన్య ప్రజలు ఏడాదిపాటు పన్ను బకాయి ఉంటే హెచ్చరికలు చేసే అధికారులు.. ప్రభుత్వ భవనాల బకాయిలపై మాత్రం దృష్టి సారించకపోవడం విమర్శలు ఉన్నాయి.

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల బకాయిలు గుదిబండలా మారాయి. సామాన్య ప్రజల నుంచి సక్రమంగా పన్నులు వసూళ్లవుతున్నా.. ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు సంబంధించి మాత్రం రూ.కోట్లలో పేరుకుపోయాయి. శ్రీకాకుళంలోనే ప్రభుత్వ కార్యాలయాల జిల్లా శాఖలన్నీ ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఏటా నగరపాలక సంస్థకు ఆయా కార్యాలయాలు పన్ను చెల్లించాలి. కానీ కొన్ని ప్రభుత్వ సంస్థలైతే ఏకంగా 1993-94 నుంచి సైతం నగర పాలక సంస్థకు పన్ను చెల్లించడం లేదు. ఆ విషయమే.. ఆయా శాఖల అధికారులు మరిచిపోతున్నారు. అలాగే పన్నుల వసూళ్లు కేవలం సామాన్యుల నుంచి మాత్రమేనని... ప్రభుత్వ భవనాల నుంచి కాదన్న రీతిలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఫలితంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థకు ప్రభుత్వ భవనాల నుంచి రావాల్సిన బకాయిలు సుమారు రూ.200కోట్లు ఉన్నాయి. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ భవనాలకుగాను ప్రాపర్టీ ట్యాక్స్ రూ.8.55 కోట్లు వసూలు చేయాలి. కానీ, ప్రస్తుతం వసూలైంది కేవలం రూ.70లక్షలు మాత్రమే. అంతకు మించి వసూళ్లవుతాయన్న నమ్మకం అధికారులకు లేదు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించాలంటే.. సంబంధిత భవనాలకు శాఖల వారీగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాలి. ఈ విషయంలో అధికారులు కూడా శ్రద్ధ చూపకపోవడంతో.. ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తే అప్పుడే చెల్లిస్తున్నారు. దీంతో బకాయిలు పేరుకుపోయి.. నగరపాలక సంస్థ అభివృద్ధి గగనమవుతోంది.

● ఏళ్ల తరబడి..

దాదాపు 150 భవనాలకు సంబంధించి ఏళ్ల తరబడి పన్ను బకాయి ఉంది. ఇందులో రూ.కోటికిపైగా బకాయిలు ఉన్నవి మూడు కార్యాలయాలు ఉన్నాయి. రూ.10 లక్షలకు పైగా బకాయి ఉన్నవి సుమారు 29 కార్యాలయాలు. రూ.10 లక్షల లోపు బకాయి ఉన్న కార్యాలయాలు చాలానే ఉన్నాయి. గరిష్ఠంగా ఆర్అండ్‌బీ శాఖ.. పన్నుల బకాయిలో ముందువరుసలో నిలిచింది. జిల్లాలో ప్రధాన రోడ్లు, భవనాలు నిర్మించేది ఈ శాఖనే. రూ.వేలాది కోట్లు ఈ శాఖ ఇంజనీరింగ్ అధికారులు వెచ్చిస్తారు. కానీ పన్ను బకాయి విషయంలో ఎవరూ శ్రద్ధ చూపించడం లేదు.

ప్రభుత్వ భవనాల పన్ను బకాయిలు ఇలా..

ప్రభుత్వ విభాగం	పన్ను బకాయి
ఈఈ, ఆర్అండ్‌బీ	రూ.4.36 కోట్లు
జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం	రూ.2.59 కోట్లు
ఈఈ, వంశధార ప్రాజెక్టు	రూ.1.02 కోట్లు
సూపరింటెండెంట్ ఇంజనీర్(వంశధార గెస్ట్‌హౌస్)	రూ.77.75 లక్షలు
పీడీ, డీఆర్‌డీఏ	రూ.62.75 లక్షలు
తాలూకా ఆఫీసు	రూ.55.76 లక్షలు
ఈఈ, వంశధార ప్రాజెక్టు కాలనీ	రూ.40.19 లక్షలు
డీడీ, సోషల్ వెల్ఫేర్	రూ.49.68 లక్షలు
అడిషనల్ మున్సిఫ్ కోర్టు	రూ.26.72 లక్షలు
జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి	రూ.36.78 లక్షలు
ప్రిన్సిపాల్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు	రూ.23.35 లక్షలు
సెక్షన్ ఆఫీస్, పీడబ్ల్యూడీ	రూ.26.40 లక్షలు
ఖాదీ గ్రామస్వరాజ్య సంఘం	రూ.21.66 లక్షలు
జిల్లా గిరిజన హాస్టల్	రూ.20.06 లక్షలు
రెవెన్యూ క్లబ్	రూ.19.16 లక్షలు
ఈడీ, ఎస్సీ కార్పొరేషన్	రూ.20.78 లక్షలు
ఎంపీడీవో డివిజనల్ ఆఫీసర్	రూ.17.58 లక్షలు
అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్(నర్సన్ కాలనీ)	రూ.17.01 లక్షలు
ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్	రూ.16.42 లక్షలు
ఎస్ఈ, పీడబ్ల్యూడీ, వంశధార ప్రాజెక్టు	రూ.15.58 లక్షలు
జిల్లా డివిజనల్ ప్లానింగ్ ఎక్స్‌టెన్షన్ భవనం	రూ.14.12 లక్షలు
అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్	రూ.13.09 లక్షలు
ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్	రూ.11.27 లక్షలు
ఉప ఖజానా కార్యాలయం	రూ.13.23 లక్షలు
ప్రభుత్వ బాలికల హాస్టల్	రూ.12.20 లక్షలు
ట్రాఫిక్ పోలీసు స్టేషన్	రూ.12.21 లక్షలు
సెంట్రల్ క్రైమ్ స్టేషన్	రూ.12.75 లక్షలు
జిల్లా అటవీశాఖ కార్యాలయం	రూ.11.37 లక్షలు
సెక్రటరీ, పోలీస్‌వెల్ఫేర్ ఆఫీస్ షాపింగ్ కాంప్లెక్స్	రూ.11.50 లక్షలు
సెకెండ్ అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు-1	రూ.10.68 లక్షలు
డిప్యూటీ డైరెక్టర్(ఎస్.ఎఫ్), గర్ల్స్ హాస్టల్	రూ.10.11 లక్షలు
వనవిజ్ఞాన కేంద్రం(ఫారెస్ట్ ఆఫీస్)	రూ.10.07 లక్షలు

దీంతో ఏకంగా రూ.4.36 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ బకాయి ఉంది. తర్వాత స్థానంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ, వంశధార ప్రాజెక్టు నిలిచాయి. ఇలా అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సంబంధించి భారీగా పేరుకుపోయిన పన్ను బకాయిలు ఎప్పటికి వసూళ్లు అవుతాయనేది ప్రశ్నార్థకమే.



అరసవల్లిలో బారులుదీరిన భక్తులు

ఇంద్ర పుష్కరిణి వద్ద..



శ్రీకూర్మంలో భక్తుల రద్దీ

భక్తజన సందడి

అరసవల్లి/ గార, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆదివారం సందర్భంగా అరసవల్లి, శ్రీకూర్మంలో భక్తజన సందడి నెలకొంది. అరసవల్లిలో క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఒక్కరోజే ఆదిత్యుడికి రూ.8,84,109 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.5,46,800, విరాళాల ద్వారా రూ.57,159, ప్రసాదాల ద్వారా రూ.2,80,150 లభించినట్టు ఆలయ ఈవో వై.భద్రాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీకూర్మంలో కూడా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఈవో గురునాథరావు తెలిపారు.

నీరు లేని వంశధార

● గొట్టా బ్యారేజీలో తగ్గిన నీటిమట్టం

హిరమండలం, నవంబరు 24: హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద వంశధార నీటిమట్టం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఈ ఏడాది ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో సరిగా వర్షాలు లేక ఇన్‌ఫ్లో తక్కువగా వస్తోంది. జిల్లాలో కూడా ఆశించినస్థాయిలో వర్షాలు లేక నీటి ప్రవాహం తగ్గింది. ఆదివారం సాయంత్రానికి గొట్టాబ్యారేజీ వద్ద 37.00మీటర్లు నీటి మట్టం ఉండగా.. 580 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. అలాగే వంశధార రిజర్వాయర్‌లో కూడా నీటి నిల్వ లేకుండా పోయింది. రిజర్వాయర్‌లో ఉన్న కొద్దిపాటి నీటిని ఖరీఫ్ సాగుకు కుడికాలువ ద్వారా విడిచిపెట్టేశారు. వారం రోజుల కిందట రిజర్వాయర్ ద్వారా కూడా నీటి విడుదల నిలిచిపోయింది. ఇప్పటికే ఈ ఏడాది రబీ పంటలు వేయొద్దని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడమ కాలువ ద్వారా శివారు మండలాలకు ఇంకా ఖరీఫ్ సాగుకు నీరు కావాలని కోరడంతో అధికారులు 50 క్యూ సెక్కులు విడిచిపెడుతున్నారు.



గొట్టాబ్యారేజీ వద్ద నీరు ఇలా..

దీన్ దయాళ్ క్షేత్రంలో అరకొర ఉత్పత్తితో

ఓఎన్‌జీసీకి తిప్పలు



రోజుకు కేవలం 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ గ్యాస్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ తీరంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉన్న దీన్ దయాళ్ సహజ వాయువు క్షేత్రం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి పెద్ద గుదిబండలా మారింది. భారీ గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే పేరుతో గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్‌పీసీఎల్) ఈ గ్యాస్ ఫీల్డ్‌ను 2017 జూలైలో ఓఎన్‌జీసీకి అంటగట్టింది. అంతకు ముందే జీఎస్‌పీసీ ఈ సహజ వాయు క్షేత్రంలో తనకున్న 80 శాతం వాటాలో 50 శాతం ఇస్తానన్నా ఓఎన్‌జీసీ తిరస్కరించింది. అయితే 2017కు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. దీన్ దయాళ్ ఫీల్డ్ ఈక్విటీలో తనకున్న మొత్తం 80 శాతం వాటాను జీఎస్‌పీసీ.. ఓఎన్‌జీసీకి రూ.7,738 కోట్లకు విక్రయించింది.

అంతా 'గ్యాసే'

జీఎస్‌పీసీఎల్ ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు, దీన్నుంచి రోజూ 20 కోట్ల ప్రామాణిక ఘనపుటడుగుల (ఎంఎస్‌సీఎఫ్‌పీడీ) గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని మొదట్లో గ్యాస్ కొట్టింది. ఓఎన్‌జీసీకి తన 80 శాతం వాటా అమ్మే నాటికే జీఎస్‌పీసీ ఈ క్షేత్రంలో మూడు గ్యాస్ బావులు తవ్వింది. ఓఎన్‌జీసీ చేతికి వచ్చాక మరో ఏడు బావులు తవ్వారు. సాంకేతిక సమస్యలతో ఇందులో మూడు బావుల డ్రిల్లింగ్ మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేసిన మిగతా నాలుగు బావుల్లోనూ రోజువారీ గ్యాస్ ఉత్పత్తి 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ మించడం లేదు.

ఖర్చు బారెడు

తన చేతికి వచ్చాక ఓఎన్‌జీసీ.. దీన్ దయాళ్ క్షేత్రం ఫీల్డ్ అభివృద్ధి కోసం పెద్ద మొత్తమే ఖర్చు చేసింది. ఈ కొనుగోలుతో జీఎస్‌పీసీఎల్ మాత్రం తన అప్పుల భారం కుదించుకుంది. ఓఎన్‌జీసీ మాత్రం తన మిగులు నిధుల్లో ఎక్కువ భాగం ఇందుకోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. మంచి ఆర్థిక స్తోమత, టెక్నాలజీ ఉన్న ఏదైనా సంస్థ ముందుకు వస్తే భాగస్వామ్యంతో దీన్ దయాళ్ గ్యాస్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేయాలని ఓఎన్‌జీసీ చూస్తోంది. అందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ గ్యాస్ ఫీల్డ్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి పెద్ద భారంగా మారింది.

బీమా సుగమ్ కోసం రూ.500 కోట్లు

ముంబై: భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తలపెట్టిన 'బీమా సుగమ్' ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో బీమా కంపెనీలు ఈ అంచనాకు వచ్చినట్టు సమాచారం. అన్ని రకాల బీమా పాలసీల మార్కెటింగ్, ఇతర సేవలు ఒకే చోట అందించేందుకు ఐఆర్‌డీఏఐ ఈ సింగిల్ విండో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను తలపెట్టింది. ఇందుకు రూ.100 నుంచి రూ.200 కోట్లు ఖర్చవుతుందని మొదట్లో అంచనా వేశారు. తాజా అంచనాల ప్రకారం ఇందుకు ఎంతలేదన్నా రూ.500 కోట్లు ఖర్చవుతుందని కంపెనీలు ఒక అంచనాకు వచ్చాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభానికల్లా దీన్ని అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది.

హీరో, జీరో భాగస్వామ్యంలో కొత్త ఈ-బైక్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ భాగస్వామ్యంలో హీరో మోటో కార్ప్ రూపొందిస్తున్న మిడ్ పెర్ఫార్మెన్స్ విద్యుత్ బైక్ అభివృద్ధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నదని చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీలో పేరెన్నిక గన్న కాలిఫోర్నియాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ 6 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు హీరో మోటో కార్ప్ డైరెక్టర్ల బోర్డు 2022 సెప్టెంబరులో ఆమోదించింది. తమ భాగస్వామ్యంలో ప్రీమియం విద్యుత్ బైక్‌లు రూపొందిస్తామని 2023లో రెండు కంపెనీలు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యంలో మిడ్ పెర్ఫార్మెన్స్ ఈ- బైక్ అభివృద్ధి దశలో ఉన్నదని హీరో మోటో కార్ప్ సీఈఓ నిరంజన్ గుప్తా తెలిపారు.

డిసెంబరులోనూ ఐపీఓల జోరు

10 ఇష్యూలు.. రూ.20,000 కోట్ల సమీకరణ!

నూఢిల్లీ: సెకండరీ మార్కెట్ ఆటుపోట్లలో ఉన్నా, ప్రైమరీ మార్కెట్ జోరు తగ్గడం లేదు. వచ్చే నెల కూడా 10 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల ద్వారా రూ.20,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో సూపర్ మార్కెట్ చెయిన్ విశాల్ మెగా మార్ట్, బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని డైమండ్ గ్రేడింగ్ కంపెనీ ఇంటర్నేషనల్ జెమ్మొలాజికల్ ఇనిస్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి లైఫ్ సైన్సెస్ కూడా ఉన్నట్టు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెప్పాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, యూపీ ఉప ఎన్నికల ఫలితాలతో ఐపీఓ మార్కెట్ సెంటిమెంట్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ వారం రాజేష్ పవర్ సర్వీసెస్ సహా మొత్తం ఆరు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభమవుతుండగా ఎన్‌టీపీసీ గ్రీన్‌తో పాటు మరో మూడు కంపెనీలు మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.

24,300 పైన బుల్లిష్

(నవంబరు 25-29 తేదీల మధ్య వారానికి)

అస్ట్రో గైడ్


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,956-23,263 పాయింట్ల మధ్యన కదలాడి 375 పాయింట్ల లాభంతో 23,907 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,562, 23,644, 23,909, 24,482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,400
నిరోధ స్థాయిలు: 24,100, 24,200, 23,400 (24,000 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,700, 23,500, 23,400 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	595
వరంగల్	582	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	75
కర్నూలు	107	నెల్లూరు	75
విశాఖపట్నం	120	అనంతపురం	75
గోదావరి	108		

లాభాల బాటలోనే.!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్ దూకుడు తగ్గటం, చైనా ఉద్దీపన పథకంతో పెద్దగా ప్రయోజనాలు లేకపోవటం, విదేశీ సంస్థాగత మదుపరులు మళ్లీ తిరిగొచ్చే సూచనలు, అదానీపై కోర్టు అభియోగాల ప్రభావం తగ్గిపోవటమే ఇందుకు కారణాలు. గత శుక్రవారం సెషన్ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో బీజేపీ విజయం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపింది.

స్టాక్ రికమండేషన్స్

జుబిలెంట్ ఫుడ్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం, ఈపీఎస్ పెరగటంతో మూమెంటమ్ కనిపిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు కొంత దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.630/600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.675/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.580 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: పేమెంట్ బ్యాంక్ సేవలకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో దూసుకుపోతోంది. నష్టాల మార్కెట్లోనూ పటిష్ఠతను సూచించింది. రిలేటివ్ స్ట్రెంత్ చాలా బాగుంది. ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ జోన్ వద్దకు చేరుకుంటోంది. దాన్ని బ్రేక్ చేస్తే ఇక తిరుగులేదు. గత శుక్రవారం 6.5 శాతం లాభంతో రూ.900 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫీనిక్స్ మిల్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 33 శాతం మేర పతనమైంది. తాజాగా మళ్లీ పెరుగుతూ వస్తోంది. చివరి నాలుగు సెషన్లలో ఏకంగా 18 శాతం పెరిగింది. గత శుక్రవారం 5.33 శాతం లాభంతో రూ.1,616 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రియా లైఫ్ సైన్సెస్: ఐపీఓ ఇష్యూ ధర నుంచి 70 శాతం మేర పతనమైన ఈ షేరు గత ఏడాది మార్చి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. అప్పటి నుంచి బుల్‌రన్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ షేరుకు ఐపీఓ గరిష్ఠ స్థాయి వద్ద మద్దతు లభించింది. సేల్స్ ఈపీఎస్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం 14 శాతం లాభంతో రూ.806 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.860/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విజయ డయాగ్నోస్టిక్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. మెరుగైన ఫలితాలు ప్రకటించటం, ఈపీఎస్, సేల్స్ పెరగటంతో మూమెంటమ్ పెరిగింది. బడా ఇన్వెస్టర్లు అక్యుములేట్ చేసుకుంటున్నారు. చివరి మూడు సెషన్లలో 25 శాతం పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.




- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 ఎగువన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో డౌన్ ట్రెండ్‌ను కొనసాగిస్తూ 23,300 కన్నా దిగజారినా శుక్రవారం ఏర్పడిన బలమైన రికవరీలో 560 పాయింట్ల మేరకు లాభపడింది. చివరికి గత వారంతో పోల్చితే 375 పాయింట్ల లాభంతో 23,900 సమీపంలో ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ ఎనిమిది వారాల డౌన్ ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించింది. అయితే మార్కెట్ ఇప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ నిట్టనిలువుగా బౌన్స్‌బ్యాక్ సాధించినందు వల్ల స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే కన్సాలిడేట్ కావడం తప్పనిసరి. అయితే ఈ రివర్సల్‌తో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పును మాత్రం తప్పించుకుంది. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 975 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 155 పాయింట్లు లాభపడ్డాయి. ఈ వారంలో నిఫ్టీ మరింత పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 24,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత పాజిటివ్ సంకేతం ఇవ్వాలంటే నిఫ్టీ తదుపరి నిరోధం 24,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు 24,350, 24,550. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేషన్ తప్పనిసరి. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 950 పాయింట్ల మేరకు రికవరీ సాధించి చివరికి 51,000 కన్నా స్వల్పంగా పైన క్లోజైంది. మరింత సానుకూలత కోసం తదుపరి నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,200. ప్రస్తుత మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 49,400.

పాటర్న్: నిఫ్టీ గత వారం 200 డిఎంఏ వద్ద రికవరీ సాధించింది. ఇప్పుడు నిరోధ స్థాయి 24,100 సమీపంలో గల 25 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం ఓవర్‌సోల్డ్ స్థితి నుంచి కోలుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	24,000, 24,155
మద్దతు	24,000, 23,920



నవ్య | చిత్రజ్యోతి



ఆ కోరికను పుష్ప 2 తీర్చింది

'పుష్ప చిత్రం అంతర్జాతీయ స్థాయిలో నాకు నటుడిగా గుర్తింపును ఇచ్చింది. డిసెంబర్ 5న వస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంతో దేశవ్యాప్తంగా వైల్డ్ ఫైర్ రాబోతోంది. మూడేళ్ల నా జీవితాన్ని ఈ సినిమాకు అంకితం చేశాను. హీరో అయినప్పటి నుంచి చెన్నైలో నా సినిమా కార్యక్రమం ఒక్కటైనా చేయాలనుకుంటున్నాను. ఆ కోరికను 'పుష్ప 2' తీర్చింది' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఆదివారం చెన్నైలో 'వైల్డ్ ఫైర్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అల్లు అర్జున్, శ్రీలీల నర్తించిన ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ 'రష్మిక తక్కువ సమయంలోనే నా మనసుకు దగ్గరయ్యారు. తను నన్ను చాలా బాగా ప్రోత్సహించారు. అల్లు అర్జున్ పాట కావడంతో బాగా కష్టపడ్డాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'పుష్ప' కు ముందు తర్వాత అనేలా నా కెరీర్ మారింది. నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా ఈ చిత్రం మిగిలిపోతుంది' అన్నారు.

ఖరీదైన కానుకలు ఇచ్చా



ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె హీరో వరుణ్ ధావన్‌తో స్పైసీ ర్యాపిడ్ ఫైర్ అనే సరదా సంభాషణలో పాల్గొన్నారు. 'ట్రూత్ అండ్ డేర్ గేమ్‌లా ఉండే ఇందులో.. వరుణ్ అడిగిన దానికి సమాధానం చెప్పాలి.. చెప్పలేకపోతే పచ్చిమిర్చి తినాలి. 'మీరు ఏ వస్తువుల కోసం డబ్బులు అనవసరంగా ఖర్చు చేశారు' అని వరుణ్ అడిగారు. "నా ఎక్స్‌కు ఇచ్చిన కానుకల కోసం' అని సమంత సమాధానమిచ్చారు. 'అవునా.. ఎంత ఖర్చైంది' అని వరుణ్ అడగ్గా.. 'కొంచెం ఎక్కువే.. ఇక, తరువాతి ప్రశ్నకు పోదామా' అని సమంత బదులిచ్చారు. 'మీరు ఈ కార్యక్రమానికి వచ్చే ముందు ఎవరికి చివరగా మెసేజ్ చేశారు. దాన్ని పైకి చదివి వినిపిస్తారా' అని వరుణ్ అడగ్గా.. ఆ ప్రశ్నకు సమాధానమివ్వని సామ్ పచ్చిమిర్చి తిన్నారు.

ప్రేమంటారా? కాదంటారా?



ప్రేమలో ఉన్నామని పైకి చెప్పకపోయినా తరచూ చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతూ కెమెరాలకు చిక్కుతున్నారు విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్న. తాజాగా ఈ జంట మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వీరిద్దరూ కలసి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన 'పుష్ప 2' కార్యక్రమంలో 'మీ ప్రేమ, పెళ్లి గురించి చెప్పండి' అని యాంకర్ రష్మికను అడగ్గా 'తొందరెందుకు 'పుష్ప 2' విడుదలయ్యాక మీరే చూస్తారు కదా' అని బదులిచ్చారు. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తా, బయట వ్యక్తా అని అడిగితే 'అది అందరికీ తెలిసిన విషయమే కదా' అంటూ స్పందించారు.






గార: మొగదాలపాడు బీచ్‌లో సందర్శకులు..


పలాస రూరల్: గండాహతి జలపాతం వద్ద..

పిక్నిక్ సందడి

● బీచ్‌లు, జలపాతాలకు సందర్శకుల తాకిడి

జిల్లా వ్యాప్తంగా ఆదివారం పిక్నిక్‌ల సందడి నెలకొంది. కుటుంబాలతో బీచ్‌లు, తోటల్లో ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్తీక వన భోజనాలు జరుపుకున్నారు. జిల్లాలోని ప్రధానమైన మొగదాలపాడు, కె.మత్స్యలేశం, శివసాగర్ బీచ్‌లతోపాటు గండాహతి జలపాతం, మహేంద్రతనయ కొండల్లో జాలువారే నీటిలో సందడిగా గడిపారు. కాగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- గార/ పలాస రూరల్/ వజ్రపుకొత్తూరు


వజ్రపుకొత్తూరు: శివసాగర్ బీచ్‌లో..

శబరిమలైకు ప్రత్యేక రైళ్లు

ఆమదాలవలస, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తులు, దీక్షాపరులకు శ్రీకాకుళం రోడ్డు నుంచి కేరళ రాష్ట్రంలోని కొల్లం వరకు రైల్వేశాఖ ప్రత్యేక రైలు ఏర్పాటుచేసింది. ఈనెల20న ఆంధ్రజ్యోతిలో శబరిమలైకు వెళ్లేది ఎలాశీర్షికతో కథనం ప్రచురితం కావడంతో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకున్నారు. ఈ మేరకు డిసెంబరు ఒకటినుంచి జనవరి 19వతేదీ వరకు ప్రతి ఆదివారం ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక రైలుఇక్కడ బయలుదేరుతుంది. తిరిగి ప్రయాణంలోకొల్లం నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరుతున్నట్లు రైల్వే శాఖ అధికారులు ప్రకటించారు.

పదవులు కన్నా ప్రజాసేవ ముఖ్యం

● ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

కవిటి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పదవులు కన్నా ప్రజాసేవ ముఖ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, వరక, బొరివంక, బెజ్జిపుట్టుగ, జగతి గ్రామస్థులు, కూటమి నాయకులు విప్‌గా బాధ్యతలు స్వీకరించి ఆదివారం వచ్చిన అశోక్‌ను స్వాగతం పలికారు. రామయ్యపుట్టుగలో ఇంటి వద్ద కుటుంబసభ్యులు హారతిపట్టి ఆహ్వానించారు. బొరివంకలో మాజీ ఎమ్మెల్యే బి.వెంకటేశ్వర శర్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.


కవిటి: హారతి పడుతున్న కుటుంబసభ్యులు

● సోంపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు టీడీపీనాయకులు ఆదివారం స్వాగతం పలికారు. కొర్లాం జాతీయరహదారి వద్ద నాలుగు మండలాల నాయకులతో పాటు మునిసిపాలిటీ టీడీపీనాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం జాతీయ రహదారి నుంచి బారువా, పలాసపురం, లక్కవరం, జింగిబద్ర, సోంపేట మీదుగా బైక్‌ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మద్దిల నాగేశ్వరావు, జీకే నాయుడు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు పాల్గొన్నారు.

● కంచిలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా వచ్చిన బెందాళం అశోక్‌కు కొర్లాం జంక్షన్‌లో టీడీపీ నాయకులు స్వాగతం పలికారు.

ఇచ్ఛాపురంలో 5కే రన్

ఇచ్ఛాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణ నుంచి ఆదివారం రోటరీక్లబ్ న్యాజ నరేషన్ మంత్ పురస్కరించుకుని 5కే రన్ నిర్వహించారు. యువత, సీనియర్ క్రీడాకారులు పాల్గొనగా, విజేతలకు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు దినేష్‌కుమార్, నవీన్‌కుమార్, గోపాల్, కృష్ణమూర్తిరెడ్డి, నవీన్ పాల్గొన్నారు .

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ

శ్రీకాకుళంక్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద కోరారు. ఆదివారం శ్రీకాకుళంలో డగ్స్, టొబాకో వంటి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులతో ప్రజల కు అవగాహన కల్పించేందుకు అరసవిల్లి కూడలి నుంచి సూర్య మహల్ జంక్షన్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐ కె.పైడపునాయుడు, బీఎస్ చక్రవర్తి, కె.శివశంకర్, కె.వేణు, పైడి రాజు పాల్గొన్నారు.

చర్యలు తప్పవు

గార, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆర్.జనార్దన్ తెలిపారు. ఆదివారం గార మూడు రోడ్లు కూడలి వద్ద వాహనాలు తనిఖీచేశారు.

క్రమశిక్షణతోనే సత్ఫలితాలు

రణస్థలం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో ఐక్యమత్యంగా పనిచేస్తే సత్ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే, ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం రణస్థలంలో ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 76వ ఎన్‌సీసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ఉత్తమ పౌరుడిగా ఎదగాలంటే బాల్యం నుంచే ఎన్‌సీసీ, స్కౌట్ వంటివి ఉపయోగించుకోవాలన్నారు. స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజాబాబు విద్యార్థులకు ఎన్‌సీసీ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఈఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఊర్మిళ దీక్షిత్ పాల్గొన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

బాధితులను ఆదుకుంటాం

జి.సిగడాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్‌ఈఆర్) తెలిపారు. సంతవురిటిలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను ఆదివారం పరామర్శించారు. కాలిబూడిదైన ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో సత్యనారాయణ, ఈఏ కుసుమ, ఆర్ఐ అబోతుల రాధ, వీఆర్వో శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా ఇటీవల సాగునీటి కోసం కొట్లాట దాడిలో గాయపడిన జి.సిగడాంకు చెందిన టీడీపీ కార్యకర్తలు నాయన సూర్యారావు, వెంకటరావును పరామర్శించారు. ఎందువలో నవ దుర్గదేవి అమ్మవారి ఆలయాన్ని ఆయన సందర్శించారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ఎచ్చెర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. పెయ్యలవానిపేటలోని విశ్రాంత డీఈఈ దుంగ కృష్ణమూర్తి నిర్వహించిన అయ్యప్ప పడి పూజలో పాల్గొన్నారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, జగపతిబాబు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టుశాలి సామాజికవర్గ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఆదివారం తోటపాలెంలోని వెంకన్నగారి తోటలో పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం కార్తీకమాస వనభోజన మహోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుశాలీలు ఐకమత్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నా రు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పట్టుశాలి సామాజిక వర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలగలను బీసీల్లో చేర్చాలి

ఆమదాలవలస, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలగ కులస్థులను బీసీల జాబితాలో చేర్చాలని ఆ సంఘం ఉత్తరాంధ్ర నాయకులు పల్లంటి వెంకటరామారావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మన్నయ్యపేట ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన తెలగ కులస్థుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. బోడెం భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ సాధన సమితి ఉత్తరాంధ్ర జేఏసీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధి రొక్కం సూర్య ప్రకాశరావు, అత్తులూరి మురళీమోహన్‌రావు, చనమల ప్రసాదరావు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఐఎంఏకు రెండు అవార్డులు

రణస్థలం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరులో మూడు రోజుల పాటు జరిగిన ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ (ఐఎంఏ) వార్షికో త్సవంలో శ్రీకాకుళం జిల్లా ఇండియన్ మెడికల్ అ సోసియేషన్ శాఖకు రెం డు అవార్డు లభించాయి. ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డు డాక్టర్ ఎస్.నర్సిం హమూర్తికి, మిషన్ పింక్ యాక్టివిటీ అవార్డు ఐఎంఏ శ్రీకాకుళం విమెన్ డాక్టర్స్ వింగ్‌కు దక్కాయి. ఈ అవార్డులను డాక్టర్లు నర్సింహమూర్తి, గంగాధర్ అందుకున్నారు.

నేటి నుంచి మహా కుంబాభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బోడెమ్మ కోవెలవీధిలో గల ఉమాజీవేశ్వరాలయంలో సోమవారం నుంచి 30వ తేదీ వరకూ శివపంచాయతన సహిత రుద్ర యాగ పూర్వక మహా కుంబాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.శ్రీను, మందేల అనీల్ శర్మ, రంగాభట్ల శ్రీను, ప్రకాష్ పంతులు పాల్గొన్నారు.

ఆ.. చట్టాలను రద్దుచేయాలి

అరసవల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసుకువచ్చిన నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం నిర్వహించే కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆల్‌ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు.

● రణస్థలం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.రమణ, కిసాన్ కాంగ్రెస్ నాయకులు వెంకటనాయుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం రణస్థలంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నా విజయవంతం చేయాలని ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్

కవిటి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కవిటి మండలానికి చెందిన పి.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, ఏపీ ఇన్‌చార్జి మమత నాగిరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. తనను నియమించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

జూడో పోటీల్లో జిల్లాకు పతకాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలో ఇటీవల జరిగిన అండర్-19 స్కూల్‌గేమ్స్ జూడో పోటీల్లో జిల్లాకు మూడు కాంస్య, రెండు బంగారు పతకాలు లభించాయి. నవీన్, శివ, షన్ముఖ రజిత, ప్రసాద్, సౌమ్యలకు బంగారు పతకాలు సాధించారు. పోలవరం పీఈటీ పి.జగదీశ్వరరావు జట్టుకు మేనేజర్‌గా వ్యవహించారు. క్రీడాకారులను డీఈవో తదితరులు అభినందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోటబొమ్మాళి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద హైవేపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కస్తూరిపాడు పంచాయతీ గంగుపేటకి చెందిన కోనారి శిమ్మయ్య (72) రెండేళ్లుగా మతిస్థిమితం లేక రోడ్డుపై సంచరిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై కోటబొమ్మాళి వైపునుంచి టెక్కలి వైపు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అతడి తలతో పాటు అవయవాలు గుర్తించలేని విధంగా నుజ్జునుజ్జయ్యాయి. ఇతనికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మొదటి ముగ్గురు కుమారులు నెల్లూరు లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగో కుమారుడు విశాఖలో పనిచేస్తున్నారు. ఐదో కుమారుడు, కుమార్తె వద్ద శిమయ్య ఉండేవాడు. రెండేళ్లుగా మతిస్థిమితం కోల్పోయి ఆదివారం మృత్యువాత పడ్డాడు. కుమారుడు ఆనందరావు విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

500 లీటర్ల బెల్ల ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నవరకుద్దబ గ్రామంలో సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 500 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్‌కే మీరాసాహెబ్ తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 20 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో టెక్కలి, కోటబొమ్మాళి ఎక్సైజ్ ఎస్ఐలు సత్యనారాయణ మూర్తి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఫిర్యాదు

టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాతో పాటు కొన్ని సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకరంగా, దుర్భాషలాడుతూ దూషిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దివ్వెల మాధురి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై జనసేన నాయకులు ఘోరంగా మాట్లాడుతూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారని, తనకు పలువురి నుంచి ప్రాణహాని ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై దుర్భాషలాడుతున్న జనసేన నేతలు అట్టాడ శ్రీధర్, ఉదయపురం నవీన్, నర్సిపురం శేఖర్, బొడ్డ శ్రీనివాస్, గొనప చందులపై చర్యలు తీసుకోవాలని సీఐ విజయ్‌కుమార్‌కు అందజేశారు.

24మంది పేకాటరాయుళ్ల అరెస్టు

టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం పాండవుల మెట్ట తోటల్లో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడిచేశారు. ఈ సందర్భంగా 24 మందిని అదుపులోకి తీసుకుని రూ.2,34,150లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

శ్రీముఖలింగేశ్వర ఆలయం కిటకిట



శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

జలుమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనార్థం ఆదివారం భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే శ్రీముఖలింగం చేరుకొని శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులతో ఆలయం కిటకిట లాడింది. భక్తులకు ఎటువంటి ఇక్కట్లు లేకుండా దేవాలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రజాభిప్రాయం సేకరించకుండా ఎయిర్‌పోర్ట్ నిర్మించవద్దు

పలాస, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా పలాస నియోజకవర్గంలో విమానాశ్రయ నిర్మాణం చేపట్టవద్దని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టుకు 1400 ఎకరాల భూమి అవసరం ఉంటుందని, దీనిలో ఎవరి ప్రయోజనాలున్నాయని ప్రశ్నించారు. ఉద్దానం అభివృద్ధి కావాలంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మామిడి భీమారావు, ఎం.తాతారావు, బంగ్లాకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌కు మందసలో ఘన స్వాగతం



బాలిగాం వద్ద ఎమ్మెల్యే అశోక్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

హరిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారి నియోజకవర్గం వస్తున్న సందర్భంగా మందసలో ఆదివారం టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మందస- హరిపురం రోడ్డులో అశోక్‌కు స్వాగతం చెప్పి శాలువా కప్పి, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, తమిరి భాస్కరరావు, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, దేబాసిస్ పండా తదితరులు పాల్గొన్నారు.

చెరుకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



రైతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, నవంబరు 24: (ఆంధ్రజ్యోతి) చెరుకు పంట నష్టపోయిన రైతులక ఆదుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట మండలం కిళ్లాం, పోలాకి మండలం కొల్లివలస గ్రామానికి చెందిన చెరుకు పంట నష్టపోయిన రైతులను ఆదివారం పరామర్శించారు. అగ్నిప్రమాదానికి గురై చెరుకుపంట నష్టపోయిన రైతులు బైరి గోవిందరావు, బైరి సింహాచలం, బైరి నర్సునాయుడు, మెండ రాజారావు, మెండ వాసు, మెండ పద్మ, ఆర్.బి.రామన్నలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి మండలాల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, ఎం.వెంకటప్పటనాయుడు, నాయకులు బైరి భాస్కరరావు, పొదిలాపు వేణుగోపాలరావు, ధర్మాన గణపతి, బైరి సుందరరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో జగన్ అవినీతి: కళా



మాట్లాడుతున్న కళావెంకటరావు

రణస్థలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్ష కోట్లు దోచుకున్న వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి అంతర్జాతీయ స్థాయిలో అవినీతికి పాల్పడడంతో రాష్ట్రం పరువు పోయిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. ఆదివారం పైడిభీమవరంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దుచేసి అవినీతి సొమ్ము కోసం అదానీతో ఒప్పందాలను చేసుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

సభ్యత్వ నమోదు ముమ్మరం చేయండి

- వెనుకబడడంపై మంత్రి అచ్చెన్నాయుడు అసంతృప్తి

టెక్కలి/నందిగాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతనెల 26న సభ్యత్వ నమోదు ప్రారంభమైందని, ప్రతి మండలానికి ఐదుగురు సభ్యులను నియమించామన్నారు. గతంలో సభ్యత్వ నమోదులో రాష్ట్రస్థాయిలో టెక్కలి ముందువరసలో ఉండేదని, ప్రస్తుతం చాలా వెనుకబడ్డామన్నారు. నందిగాం మండలం నాలుగో స్థానంలో ఉండడం ఎంతవరకు సమంజసమని నాయకులను ప్రశ్నించారు. మంత్రి నియోజక వర్గంలో సభ్యత్వ నమోదులో వెనుకబాటుతనం సరికాదని, ప్రతి ఒక్కరు కదిలి పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని సూచించారు.

ఇప్పటి వరకు సభ్యత్వ నమోదు ఇలా..

జిల్లాలో టీడీపీ సభ్యత్వ నమోదు నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు పాతపట్నం నియోజకవర్గంలో 43,202 మంది, పలాసలో 25,668 మంది, శ్రీకాకుళంలో 25,505 మంది, టెక్కలిలో 19,437 మంది, ఆమదాలవలసలో 15,366 మంది, నరసన్నపేటలో 16,998 మంది, ఇచ్ఛాపురంలో 17,133 మంది సభ్యత్వ నమోదు చేసుకున్నారు. అయితే ఖరీఫ్ సీజన్ పనుల కారణంగా సభ్యత్వ నమోదులో వెనుక బడి ఉన్నట్లు నేతలు పేర్కొంటున్నారు.

'తప్పుడు ప్రచారాలకు స్వస్తి పలకాలి'

నరసన్నపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేయడం తగదని టీడీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. తప్పుడు ప్రచారాలకు స్వస్తి పలకాలని లేకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇసుకను అక్రమంగా తరలించి అక్రమ ఆర్జనకు అలవాటు పడిన వైసీపీ నాయకులు టీడీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 6 నెలల్లోనే నియోజకవర్గంలో సుమారు రూ.50 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేయించిన ఘనత రమణమూర్తికే దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య కమిటీ కార్యదర్శి జామి వెంకటరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జల్లు చంద్రమౌళి, పోలాకి మండల అధ్యక్షుడు ఎం.వెంకటప్పలనాయుడు, బైరి భాస్కరరావు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి తలపాగా



టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం శివలింగానికి తలపాగా పెట్టి పూజలు చేశారు. అర్చకుడు తర్లా శివకుమార్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాలను టెక్కలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆదివారం పరిశీలించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై బీఎల్వోల నుంచి ఆరాతీశారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నందిగాం మండలం పెద్దతామరా పల్లి, కోటబొమ్మాళి మండలం జీయన్నపేట, చీపుర్లపాడు, సంతబొమ్మాళి మండలం చిన్నతుంగాం, పెద్ద తుంగాం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బీఎల్వోలకు పలు సూచనలు చేశారు.

సనాతన ధర్మం గొప్పది: షణ్ముఖశర్మ



శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం గొప్పదని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని బాపూజీ కళా మందిరంలో ఉపనిషన్మందిరం, సుమిత్రా కళా సమితి ఆధ్వర్యంలో ఆయన 'సూర్యదర్శనం' ప్రవచన యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పురాణాల్లో ఉన్న నైతిక విలువలు కలిగిన అంశాలను పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తీర్థయాత్ర క్షేత్రాల సందర్శన, గోమాత పూజలు, దేవతా వృక్షాలను పూజించడం వల్ల హిందుత్వం అనిపించుకుంటుందన్నారు. నిర్వాహకులు ఇప్పిలి శంకర్ శర్మ, గుమ్మా నగేష్, పి.జగన్మోహన్‌రావు, నిక్కు అప్పన్న, గుత్తు చిన్నారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సేవలో..

అరసవల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సామవేదం షణ్ముఖశర్మ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి చిత్రపటాన్ని ఈవో యర్రంశెట్టి భద్రాజీ అందజేశారు.

మహిళల రక్షణకు చర్యలు: డీఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలు రూపొందించి వారికి న్యాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నాయని మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ బి.రాజశేఖర్ తెలిపారు. సోమవారం మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం మాట్లాడారు. మహిళలకోసం రాష్ట్ర ప్రభుత్వం 112 ఫోన్ నెంబర్ అందుబాటులోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఉమ్మడి కుటుంబాలు కరువవ్వడం, పెద్దల పర్యవేక్షణ లేకపోవడంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయని చెప్పారు. మహిళ పోలీసుస్టేషన్‌లో వివాహ సంబంధాల సమస్యలపైప్రతి బుధ, శుక్రవారం భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, తప్పనిసరి పరిస్థితుల్లో 4,5 కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత మాత్రమే కేసులు కడతామని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి

పలాసరూరల్, నవంబరు 24(ఆన్‌లైన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఆదివారం మాట్లాడుతూ.. డిసెంబరు 4న విజయవాడలో జరిగే ప్రజాహక్కుల ర్యాలీలో పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి సన్యాసిరావు, మద్దిల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ర్యాంకర్‌కు అభినందన

పోలాకి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ పరీక్ష-2024 (ఈఎస్ఈ) జాతీయస్థాయిలో మూడో ర్యాంక్ సాధించిన చీడివలస పంచాయతీ జిల్లేడువలసకి చెందిన గొల్లంగి సతీష్‌కు ఆదివారం గ్రామస్థులు అభినందించారు. ప్రస్తుతం పూనేలోని ఇండియన్ డిఫెన్ సర్వీస్ ఆఫ్ ఇంజనీర్స్‌లో పనిచేస్తున్నారు. ఉద్యోగం చేస్తున్నారు.

ఏళ్లుగా.. ఎదురుచూపు

(ఐదో పేజీ తరువాయి)



ఇసుక మేటలు వేసిన సంకుజోడి కాలువ

ఈ ఘటన నిదర్శనంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వం నీరు చెట్టు పథకం కింద పనులు మంజూరు చేసినా అవి పూర్తిస్థాయిలో వ్యయం చేయలేదు. కోట్లాది రూపాయాల వ్యయంతో పూడిక తీసి, సిమెంటు నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా.. రూ.పది లక్షలతో నీరు చెట్టు పనులు చేసినా అవి ఏ మూలకు సరిపోలేదు.

ప్రజల చిరకాల వాంఛ..



సంకుజోడి రిజర్వాయర్‌గా నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. గత ప్రభుత్వాలు అన్నీ మాటలు చెప్పి చేతులు దులుపుకున్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్యే శిరీష, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు దృష్టికి సమస్య తీసుకెళ్లాం. చంద్రబాబు మా కోరిక నెరవేర్చుతారనే అనుకుంటున్నాం.

-వి.మాధవరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, ఆయకట్టు రైతు

భూముల బీడు వారుతున్నాయి..



వందల ఎకరాల సంకుజోడి చెరువు నీటి నిల్వ సామర్థ్యం లేక సగం భూములకు కూడా నీరందని దుస్థితి. దీంతో వందలాది ఆయకట్టు భూములు బీడు వారి పుట్టెడు గింజలు కూడా పండని పరిస్థితి ఏర్పడింది. వేలకు వేలు నీటి తీరువా చెల్లిస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ప్రతి చేనుకు నీరు- ప్రతి చేతికి పని స్లోగన్‌తో ఎమ్మెల్యే శిరీష పనిచేస్తుండటంతో సంకుజోడికి మోక్షం కలుగుతుందని భావిస్తున్నాం.

-బి.కర్రయ్య, ఆయకట్టు రైతు

పరిశీలించి చర్యలు..



సంకుజోడి రిజర్వాయర్ విషయమై ఇప్పటికే సంబంధిత గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు నా దృష్టికి తెచ్చారు. పూర్తిస్థాయిలో పరిశీలించి పైఅధికారులకు నివేదిస్తాను. దెబ్బతిన్న మదుములు, ఇతర సిమెంట్ నిర్మాణాలను ఎమ్మెల్యే సహకారంతో పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసి రైతులకు సాగునీటి ఇక్కట్లు లేకుండా చేస్తాం.

-శ్రీనివాసరావు, ఏఈఈ, ఇరిగేషన్, మందస

'బర్త్ సర్టిఫికేట్ల కోసం వీఆర్వోల చేతివాటం'



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రవి

కాశీబుగ్గ, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ, బర్త్ సర్టిఫికేట్ల కోసం విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి ఆరోపించారు. ఆదివారం కాశీబుగ్గ సీపీఐ కార్యాలయంలో ఏఐ ఎస్ఎఫ్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో దేశ వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్ (అపార్)లో వివరాల నమోదుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే ఉన్న ఆధార్ కార్డులో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లు తప్పులు, స్కూల్ రికార్డుల్లో పుట్టిన తేదీల మార్పులు, చిన్న అక్షర దోషాలున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో నమోదైన జనన ధ్రువీకరణ పత్రాల్లో విద్యార్థుల ఇంటిపేర్లు నమోదు కాకపోవడంతో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. బర్త్ సర్టిఫికేట్ కోసం వీఆర్వోలు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, దీనిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు పవన్, జీవన్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

హరిపురం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ 50 ఏళ్లుగా పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. హరిపురం హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. డీఈవో తిరుమల చైతన్య మాట్లాడుతూ.. అంకితభావం, వృత్తి ధర్మంతో ప్రతి ఒక్కరూ తన బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్. కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. యూటీఫ్ సంఘ బాధ్యతలు, లక్ష్యాలను వివరించారు. అంతకు ముందు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, మాదవరావు, లండ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వేజోన్ పనులకు టెండర్ల ఆహ్వానం

అరసవల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా విశాఖ రైల్వేజోన్ కోసం శ్రీకాకుళం ఎంపీ, ప్రస్తుత కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేస్తున్న కృషి ఎట్టకేలకు ఫలించింది. రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తాజాగా జోన్ పనులకు సంబంధించి రూ.149 కోట్ల అంచనాలతో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. దీనికి సంబంధించిన వివరాలను కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్ ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.

వేగంగా పనులు పూర్తిచేస్తాం: రామ్మోహన్

శ్రీకాకుళం ఎంపీగా 2014లో తొలిసారిగా గెలిచిన రామ్మోహన్‌నాయుడు తన తొలి ప్రసంగంలోనే రైల్వే జోన్ గురించి ప్రస్తావించారు. అదేసమయంలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురంలో దీక్షకుదిగారు. 2019లో రెండోసారి గెలిచిన తర్వాత జోన్ విషయంపై పోరాటంలో స్పీడ్‌పెంచారు. లోక్‌సభలో ప్రస్తావించడంతో పాటు, క్రమం తప్పకుండా రైల్వే డివిజన్, బోర్డు సమావేశాల్లో విశాఖ రైల్వేజోన్ ప్రాధాన్యతను వివరిస్తూ వచ్చారు. కాగా ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి రామ్మోహన్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వేగవంతంగా పనులు పూర్తి చేసి, ప్రయాణికులకు అంకితం చేస్తామని చెప్పారు.

హిందూ ధర్మరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే..

పొందూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అన్యమతస్థుల ప్రభావం పెరుగుతున్న తరుణంలో సనాతన హిందూ ధర్మరక్షణ బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద తెలిపారు. ఆదివారం కృష్ణాపురం ఆనందాశ్రమంలో 19వ అఖిలభారత హిందూ ధార్మిక మహాసమ్మేళనం నిర్వహించారు. ప్రపంచానికి సనాతన ధర్మాన్ని, శాంతిని ప్రబోధించే దేశంలో ప్రభుత్వాల వల్ల హిందువుల సంఖ్య తగ్గి అన్యమతస్థులు పెరిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు త్రిపుర భైరవేశ్వరానంద స్వామి, హైదరాబాద్ యోగీష్ ప్రభు స్వామీజీ, మంగళగిరి దయానంద దత్త స్వామీజీ, హైదరాబాద్ అహోబిల స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న స్వామీజీలు, మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

న్యూస్ బాక్స్

పట్టుశాలి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టుశాలి సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లిపెద్ది మధుసూదనరావు, గౌరవాధ్యక్షుడిగా దుంపా లోకేశం, ఉపాధ్యక్షుడిగా బుడ్డు భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా దుంపా శ్రీనివాస్, కోశాధికారిగా కొండేటి అచ్చుతరావు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమన్నారు. కార్యక్రమంలో శ్యామసుందర్, సాంబశివరావు, పాల్గొన్నారు.

బైపల్లి వాడబలిజ కార్యవర్గం..

వజ్రపుకొత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బైపల్లి పంచాయతీ వాడబలిజ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా చీకటి కామేశ్వర రావు, ఉపాధ్యక్షుడిగా కోనేరు కామేశ్వరరావు, కార్యదర్శిగా మద్దు సుధీర్, కోశాధికారిగా బొంపల్లి శివ, గౌరవాధ్యక్షుడుగా మద్దు లక్ష్మీనారాయణలకు ఎన్నుకున్నారు. వీరికి గ్రామపెద్దలు అభినందించారు.

శిష్టకరణ సంఘం..

ఆమదాలవలస, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస తాలూకా శిష్టకరణ సంఘం అధ్యక్షుడిగా బీవీఎస్ఎన్ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా బలివాడ మహేష్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఆమదాలవలసలోని గేదెలవానిపేట జంక్షన్ తోటలో ఆమదాలవలస తాలూకా శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు దాటిన వృద్ధులను జిల్లా అధ్యక్షుడు డబ్బీరు వాసు సన్మానించారు.

సీనియర్ జర్నలిస్ట్ కుటుంబానికి సాయం

టెక్కలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్, దివంగత పి.అప్పయ్య పంతులు కుటుంబానికి టెక్కలి నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం సాయమందించింది. అప్పయ్య పంతులు మృతి చెందడం, మూడేళ్లుగా ఇంటి బకాయిలుండడంతో ఆ మొత్తం రూ.29 వేలను సంఘ ప్రతినిధులు అందించారు. మానసిక దివ్యాంగులైన ఆ కుటుంబాన్ని కలిసి ఈ మొత్తం అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడుగూరి రాజేష్, అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

పలాసరూరల్,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని వక్తలు అన్నారు. గొల్లమాకన్నపల్లిలో స్వామి వివేకానంద సేవా సమితి ఆరో వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాపాక పురుషోత్తం, కుత్తుమ వినోద్, రాపాక కూర్మారావు, కోరాడ ధనరాజు, సంస్థసభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే..

నరసన్నపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పోటీతత్వం అలవరచుకోవాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, దాలినాయుడు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో నియోజకవర్గ స్థాయి గణిత టాలెంట్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. గత 10 సంవత్సరాలుగా సిక్కోలు గణిత ఉపాధ్యాయుల సంఘం విద్యార్థులకు ఈ టాలెంట్ పరీక్షలు నిర్వహించడం హర్షణీయమన్నారు.

పంట రక్షణలో బిజీ

నందిగాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఈనెల 27న తుఫాన్ ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు పంటలను చక్కబెట్టే పనిలో బిజీగా ఉన్నారు. కోసిన వరి చేనును కుప్పలుగా పెట్టడం, కల్లాలకు చేర్చడం వంటి పనులు చేస్తున్నారు. అలాగే యంత్రాలతో కోత చేసి ధాన్యాన్ని కల్లాలకు చేరుస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదుచేసి జిల్లా నుంచి బహిష్కరిస్తామని రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రైవేట్ ట్రావెల్స్‌లో పార్శిల్ సర్వీస్‌లను జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. పార్శిల్ బుక్ చేసే వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

ఓటర్లుగా నమోదుకావాలి

ఎచ్చెర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదులో 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లగా నమోదు కావాలని తహసీల్దార్ జి.సింహాచలం తెలిపారు. ఆదివారం మండలంలోని పొన్నాడలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలించారు. కార్యక్రమంలో స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు. పొన్నాడలోని కేజీబీవీను తహసీల్దార్ పరిశీలించారు.

- పాతపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఎన్నికల డీటీ వి.శంకరరావు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 77 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదును ప్రక్రియను ఆదివారం చేపట్టినట్లు ఆయన తెలిపారు.